
వైసీపీలో రచ్చ

పెనుకొండలో తీవ్రమైన వర్గపోరు

ఇన్‌చార్జి పదవి కోసం మాజీ మంత్రుల పోటీ

తెరపైకి లోకల్, నాన్‌లోకల్ రగడ
రోడ్డెక్కి గళం విప్పుతున్న వైనం
ఒకరు బెంగళూరు, మరొకరు అనంత నుంచి రాజకీయం



నవ్విపోదురుగాక నాకేటి అన్నట్లుగా ఉంది వైసీపీ నేతల తీరు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ పరాభవం నుంచి ఆ పార్టీ నాయకులు ఇంకా తేరుకోలేకపోతున్నారు. అప్పుడే ఆ పార్టీలో వర్గపోరు మొదలైంది. తారస్థాయికి కూడా చేరింది. పెనుకొండ నియోజకవర్గంలో రగడ సాగుతోంది. దీంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ ఎన్ని ఎత్తులకు పైఎత్తులు వేసినా గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ నిర్ణయాలు, ఆ పార్టీ నేతల దందాలు, అరాచకాలు, సెటిల్‌మెంట్ల కారణంగా ఎమ్మెల్యేలు, ఎంపీలను బదిలీలు చేసి వేరే ప్రాంతాల్లో పోటీ చేయించినా ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల బదిలీ చేసిన కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఓడిపోయినా ఇప్పటికీ వైసీపీ వర్గపోరు మాత్రం తగ్గలేదు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోసం కొంతమంది పోటీపడి రోడ్డెక్కుతున్నారు. పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కోసం ఇద్దరు మాజీ మంత్రుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. వారి వర్గీయులు వేర్వేరుగా రోడ్డెక్కి ఇన్‌చార్జి పదవి తమ నేతకే కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఓడిపోయి నాలుగు నెలలు తిరగకనే ఇన్‌చార్జి పదవి కోసం రోడ్డెక్కడంపై అందరూ నవ్వుకుంటున్నారు. - హిందూపురం

లోకల్.. నాన్ లోకల్ రగడ

పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి శంకర్‌నారాయణది ధర్మవరం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందిన వైసీపీ అభ్యర్థి ఉష శ్రీచరణ్ కళ్యాణదుర్గం నుంచి ఇక్కడకు వలస వచ్చారు. ఆమె బెంగళూరులో నివాసముంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆమె బెంగళూరు నుంచి రాజకీయం చేస్తున్నారనీ, తమ నేత లోకల్‌గా ఉంటున్నారనీ ఆయననే ఇన్‌చార్జిగా నియమించాలంటూ శంకర్‌నారాయణ వర్గీయులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. శంకర్‌నారాయణ కూడా అనంతపురంలో ఉంటున్నారు. పెనుకొండ నుంచి అనంతపురం ఎంత దూరమో, బెంగళూరు నుంచి పెనుకొండ కూడా అంతే దూరం ఉందంటూ ఉశశ్రీచరణ్ వర్గీయులు పేర్కొంటున్నారు. 2019 ఎన్నికల్లో పెనుకొండ నుంచి గెలుపొందిన శంకర్‌నారాయణకు మొదటి విడతలోనే మంత్రి పదవి దక్కింది. ఆ తర్వాత కొన్నిరోజులకే వైసీపీలో కీలకమైన సామాజికవర్గ నేతలు.. ఆయనను వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎంతగా అంటే పెనుకొండకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి సమావేశానికి వస్తుండగా చెప్పులు విసిరేంతలా.

మంత్రిగా ఉన్నపుడే నియోజకవర్గంలో బలమైన సామాజికవర్గ నేతలు.. ఆయనను వ్యతిరేకిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. శంకర్‌నారాయణ వద్దంటూ ధర్నా చేశారు. ఈ పరిస్థితుల్లో రెండున్నర సంవత్సరాలు మంత్రి పదవి అనుభవించాక ఆయనను తప్పించి, ఉషశ్రీచరణ్‌కి ఉమ్మడిజిల్లా నుంచి మంత్రి అవకాశం కల్పించారు. అంతటితో ఆగకుండా పెనుకొండ నుంచి శంకర్‌నారాయణ పోటీ చేయరాదనీ, ఆయనకు టిక్కెట్ ఇవ్వరాదని భీష్మించారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ అధిష్టానం చేసేదిలేక అక్కడ వేరేవారిని బరిలోకి దించాలని నిర్ణయించింది. కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా ఉన్న ఉషశ్రీపై ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుండేవారు. అవినీతి ఆరోపణలు సైతం మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆమెను పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దింపారు. శంకర్‌నారాయణను అనంతపురం ఎంపీగా పంపారు. ఆ ఇద్దరూ ఘోరంగా ఓడిపోయారు. వైసీపీ ఓడిపోయి అధికారం కోల్పోయిన రెండు నెలలకు వైసీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉషశ్రీని నియమించారు. అప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నవీన్‌నిశ్చల్‌ను తొలగించి, ఆమెకు జిల్లా పగ్గాలు అప్పగించారు. ఇది శంకర్‌నారాయణకు మింగుడు పడలేదు. ఎలాగైనా పెనుకొండ ఇన్‌చార్జి పదవి దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెనుకొండకు వస్తున్నారు. ఇది ఉషశ్రీచరణ్‌కు మింగుడుపడటంలేదు. ఈ పరిస్థితుల్లో శంకర్‌నారాయణ వర్గీయులు ఆయనకే నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వాలని ప్రెస్‌మీట్లు పెట్టి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉషశ్రీ వర్గీయులు ఆమెనే ఇన్‌చార్జిగా కొనసాగించాలని పట్టుబడుతున్నారు. దీంతో లోకల్, నాన్‌లోకల్ అంటూ ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు.

ఆయనవైపే సామాజికవర్గాలు

శంకర్‌నారాయణ వైపు ఆపార్టీలో ఉన్న మూడు, నాలుగు సామాజికవర్గాల నాయకులు ఉన్నారు. ఉషశ్రీ వైపు ఆ పార్టీలో కీలకమైన సామాజికవర్గ నాయకులతో పాటు మరికొంతమంది చేరారు. శంకర్‌నారాయణకు ఇన్‌చార్జి పగ్గాలు ఇవ్వాలని జగన్‌ను కోరేందుకు ఆయన వర్గీయులు త్వరలో విజయవాడ వెళ్లనున్నట్లు సమాచారం. ఉషశ్రీయే కావాలని కోరుతూ మాజీ మంత్రి ద్వారా జగన్‌ను కలిసేందుకు మరో వర్గీయులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పెనుకొండ నియోజకవర్గ వైసీపీలో ఆ పార్టీ అధికారంలో లేకపోయినా ఇన్‌చార్జి పదవికి పోటీ పడుతుండటం గమనార్హం.

భక్తిమాధుర్యం పంచిన గానం



పాటలు పాడుతున్న విద్యార్థినులు

పుట్టపర్తి: స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో బుధవారం సాయంత్రం అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు ప్రదర్శించిన సంగీత కచేరి అలరించింది. గంటపాటు గానంతో భక్తిమాధుర్యాన్ని పంచారు. అంతకుముందు విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నాలుగోరోజు కొనసాగింది. ఉదయం 7గంటలకు పూర్ణచంద్రహాల్‌లో వేదపండితులు యజ్ఞాన్ని కొనసాగిస్తూ సర్వదేవత అర్చన చేశారు. యజ్ఞంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

రేపటి వరకు మద్యం దరఖాస్తులు

పెనుకొండ, అక్టోబరు 9: మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు వేయడానికి గడువును ఈనెల 11వరకు పొడిగించినట్లు పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. దరఖాస్తులు వేయడానికి 9వ తేదీ ఆఖరు రోజని, ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్‌లోని 13 దుకాణాలు నిర్వహించడానికి ఇప్పటి వరకు 170 దరఖాస్తులు అందినట్లు వివరించారు. బుధవారం ఒక్కరోజే 43 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు.




సరస్వతి దేవి అలంకరణలో దుర్గాదేవి, లలితాంబ అమ్మవారు

సరస్వతీదేవిగా దుర్గమ్మ

లేపాక్షి, అక్టోబరు 9: దసరా శరన్నవరాత్రి వేడుకల ఏడోరోజు బుధవారం లేపాక్షి ఆలయంలో దుర్గమ్మ.. సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

ఖాద్రీశుడికి..

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకైంకర్యాలు, అలంకరణ అనంతరం సరస్వతి అలంకరణలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

లలితాంబ..

పుట్టపర్తిరూరల్ : దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మామిళ్ళకుంట లలితాంబ ఆలయంలోని లలితాంబ అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడో రోజైన బుధవారం మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



సరస్వతి అలంకరణలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి రూరల్, అక్టోబరు 9: జిల్లాలో అర్హత కలిగిన విద్యార్థులు ప్రధాన మంత్రి యశశ్వి ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మలాజ్యోతి బుధవారం ఓప్రకటనలో పేర్కొన్నారు. 9వ, 10వ, ఇంటర్ చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచారజాతుల కులాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులన్నారు. 9వ, 10వ తరగతి విద్యార్థులు అక్టోబరు 15లోపు, ఇంటర్ విద్యార్థులు అక్టోబరు 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఎస్‌సీహెచ్‌ఓఎల్‌ఏఆర్‌ఎస్‌హెచ్‌ఐపీఎ్‌ఎ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా సురేంద్ర

వైసీపీతో అంటకాగిన అధికారికి పట్టం

అనంతపురంరూరల్, అక్టోబరు 9: విద్యుత్ శాఖ శ్రీసత్యసాయి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా సురేంద్ర నియమితుడయ్యారు. ఆమేరకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాను ఇటీవల నూతన విద్యుత్ సర్కిల్‌గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలుబడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎస్ఈగా సురేంద్రను నియమించారు. ఈయన గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి అనంతపురం ఎస్‌గా పనిచేస్తూ రెండు నెలల క్రితం తిరుపతికి బదిలీపై వెళ్లారు. గతంలో జిల్లాలో వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. వైసీపీతో అంటకాగారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల్లో వైసీపీ నాయకులకు లబ్ధిచేకూర్చేలా వ్యవహరించారన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిబంధనలు తుంగలో తొక్కి వైసీపీ నేతలు చెప్పిన వారికి మంజూరు చేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కార్యాలయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం అప్పట్లో తీవ్ర దుమారం రేపింది. ఉద్యోగుల్లో కూడా తనకు అనుకూలమైన వారికి ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శలున్నాయి. అలాంటి అధికారికి తిరిగి మళ్లీ ఉమ్మడి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వడం పట్ల ఆయావర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది.











జిల్లా క్రీడాశాఖలో ఓ అధికారి మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడు. కలెక్టర్ పేరు చెప్పి బెదిరింపులకు దిగుతున్నాడు. ఇలా బెదిరిస్తూ ఇప్పటికే జనరేటర్, క్రీడా సామగ్రిని అమ్ముకున్నాడు. క్రీడాశాఖలో క్రీడాకారులు, క్రీడాభివృద్ధికి 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శాప్ గ్రాంట్, పైకా నిధులు విడుదల చేసింది. ఆ నిధులు సుమారు రూ.82లక్షలు ఓ బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ ద్వారా వచ్చే వడ్డీని అవసరమైన పనులకు వాడుకుంటూ వచ్చారు. అయితే ప్రస్తుత క్రీడాశాఖాధికారి అభివృద్ధి పేరుతో సుమారు రూ.30లక్షలు, ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి విజేతలకు చెల్లించాల్సిన ప్రైజ్ మనీ రూ.22లక్షలను యథేచ్ఛగా డ్రా చేశారు. ఎన్నికల సమయంలో వచ్చిన అబ్జర్వర్లకు క్రీడా ఏర్పాట్ల పేరుతో డ్రా చేసిన నిధుల్లో సగానికిపైగా ఖర్చు చేశారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన సొమ్మును డ్రా చేసి ఖర్చు చేశారు.

- అనంతపురం క్లాక్‌టవర్

దొరికినంత దోచెయ్..!



క్రీడాశాఖలో మోనార్క్‌లా ఓ అధికారి


గతంలో జనరేటర్ ఇక్కడ ఉండేది

- డిపాజిట్ సొమ్ము ఊడ్చేస్తున్న వైనం
- దాతల విరాళాలూ.. సొంతానికే...
- డీఎస్ఏలో జనరేటర్, క్రీడా సామగ్రి మాయం
- మాజీ డిప్యూటీ సీఎంకి సన్నిహితుడిగా గుర్తింపు
- ప్రశ్నిస్తే.. కలెక్టర్ పేరుతో బెదిరింపులు
- బెంబేలెత్తుతున్న కోచ్‌లు, సిబ్బంది

అడ్డదారిలో అందలం

అడ్డదారిలో కాంట్రాక్ట్ పద్ధతిపై 2009లో జిల్లా క్రీడా శాఖలో కోచ్‌గా చేరిన ఆయన అనతి కాలంలోనే కీలక స్థాయికి ఎదిగారు. తదనంతరం జిల్లా స్థాయి అధికారిగా చేరారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం కూడా చేశారు. 15ఏళ్ల సర్వీస్‌లో సుమారు 15సార్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. తన మోనార్క్ తత్వంతో అటు అధికారులు, ఇటు క్రీడాకారులు, కోచ్‌లకు తలనొప్పిగా మారారు. మార్చిలో జిల్లాకు వచ్చిన ఆయన అనతి కాలంలోనే తన అవినీతి, అక్రమాలను ప్రారంభించి... యథావిధిగా దోపిడీకి పాల్పడుతూ విలాస జీవితాన్ని అనుభవిస్తున్నారు. అయితే తన పరిధిలో పని చేస్తున్న సుమారు 18మంది కోచ్‌లకు మాత్రం జీతాలు చెల్లించడం లేదు.

కలెక్టర్ పేరుతో బెదిరింపులు



జిల్లా క్రీడాశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎవరైనా ప్రశ్నిస్తే జిల్లా కలెక్టర్ పేరుతో ఆయన బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా డిపాజిట్ చేసిన నిధులను డ్రా చేయడానికి గతంలో పనిచేసిన డీఎస్‌డీఓలు ఎవరూ సాహసించలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేయకూడదని గతంలో అధికారులు చెప్పుకొచ్చారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది క్రీడాకారులు, క్రీడాభివృద్ధికి సంబంధించిన నిధులు వినియోగించరాదని చెప్పినా ఆ అధికారి వినకుండా సుమారు రూ.52లక్షలు డ్రా చేసి, తినేశారనే ఆరోపణలు ఉన్నాయి. దాతలు ఇచ్చిన డబ్బు కూడా సొంతానికి జల్సా చేసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరినీ కలెక్టర్ పేరు చెప్పుకుంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నాడనే ఆరోపణలు ఆశాఖలో గట్టిగా వినిపిస్తున్నాయి.

సర్వం స్వాహా

జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం దాతలు ఇచ్చిన సొమ్మును సొంతానికి వాడుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చేసిన కంకర, తాగునీటి ట్యాంకు ఏర్పాటు పనులకు సుమారు రూ.5లక్షల వరకు దాతలు చెల్లించారని ఆయన చెప్పుకొచ్చారు. అయితే అదే పనులకు మరోసారి బిల్లులు పెట్టినట్లు సమాచారం. ఇటీవల ఓ దాత ఇండోర్‌స్టేడియంలో అభివృద్ధి కోసం రూ.30వేలు విరాళం ఇవ్వగా దాన్ని స్వాహా చేసినట్లు తెలిసింది. మే, జూన్ నెలల్లో జరిగిన ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో జేఎన్‌టీయూలో సుమారు వంద మంది క్రీడాకారులను ట్రాఫిక్ నియంత్రణ విధులకు నియమించారు. ఇందులో కోచ్‌లు కూడా ఉన్నారు. కోచ్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేలు చెల్లించారు. మిగిలిన క్రీడాకారులు వందమందికి, మాత్రం పారితోషికం ఇవ్వకపోగా విధుల్లో కనీసం తాగునీరు, భోజనవసతి కూడా కల్పించలేదు. ట్రాఫిక్ నియంత్రణకు పారితోషికంత కింద ప్రభుత్వం రూ.3లక్షలు వరకు చెల్లించినట్లు సమాచారం. అయితే ఈ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయో ఆ అధికారే చెప్పాలి. ఇటీవల ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన దులీప్‌ట్రోఫీకి సంబంధించి కోచ్‌లకు విధులు కేటాయించారు. ఈ విధులకు సుమారు రూ.3లక్షల వరకు దులీప్‌ట్రోఫీ నిర్వహణ కమిటీ నిధులు చెల్లించినా ఆ డబ్బులు కోచ్‌లకు చేరలేదు. అయితే ఆ డబ్బులు ఏమైనట్లు అని కోచ్‌లు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏ నిధులు వచ్చినా కోచ్‌లు, క్రీడాకారులకు చేరడం లేదు.

అమ్ముకున్నా.. అడిగే వారెవరు?

జిల్లా క్రీడాశాఖకు చెందిన అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఉన్న రూ.12లక్షలు విలువ చేసే జనరేటర్, 10లక్షలు విలువ చేసే క్రీడా సామగ్రిని మాయం చేశారు. విలువైన జనరేటర్‌ను ఎవరు తీసుకెళ్లారనేది అంతు చిక్కడం లేదు. గతంలో టీడీపీ హయాంలో జిల్లాకు మంజూరైన ఐదు అకాడమీలకు చెందిన క్రీడా సామగ్రిని ఇండోర్‌స్టేడియంలో భద్రపరిచారు. అయితే జనరేటర్‌తో పాటు ఆ సామగ్రిని కూడా తరలించారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. ఇది జరిగి సుమారు ఐదు నెలలు కావస్తున్నా పట్టించుకునే వారే లేరు.

శాప్‌లో ఓ అధికారి అండతోనే..

ఏపీ రాష్ట్ర క్రీడాశాఖ (శాప్)లో ఓ కీలక అధికారి వాటాలు తీసుకుంటూ జిల్లా ఉన్నతాధికారి అవినీతికి అండగా ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శాప్ అధికారికి వస్త్రాలు, విలువైన గిఫ్ట్‌లతో పాటు నగదు కూడా అందజేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లాలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో శాప్ అధికారి అండదండలతో జిల్లా అధికారి అవినీతిలో చెలరేగిపోతున్నాడు. ఆ అధికారి తీరుతో కోచ్‌లు, క్రీడాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కోచ్‌లు ప్రభుత్వానికి రహస్యంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాజాగా కలెక్టర్ సూచన మేరకు సాయం కోసం వెళ్లిన పర్వతారోహణ క్రీడాకారిణితో సైతం ఆ అధికారి అసభ్యంగా ప్రవర్తించిన విషయం వెలుగులోకి వచ్చింది.

జనరేటర్ కనబడటం లేదు



అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జనరేటర్ ఉండేది. అయితే ఆరు నెలలుగా ఆ జనరేటర్ కనబడడం లేదు. ఎవరిని అడగాలో తెలియదు. క్రీడాకారుల స్పోర్ట్స్ మెటీరియల్ కూడా కనబడటం లేదు. అయితే స్టేడియంలో అభివృద్ధి పనులు చేశారు. వాటన్నింటికి డబ్బులు ఎక్కడివో కూడా మాకు తెలియదు. ఇక మిగిలిన విషయాలు మా పరిధిలో లేనివి. అవన్నీ ఉన్నతాధికారులు చూసుకుంటారు. అంతేగాక కోచ్‌లను ఆఫీస్‌లోకి ప్రస్తుతం అనుమతించడం లేదు. గతంలో కోచ్‌లు, సిబ్బంది కలిసి పనిచేసేవారు.

- అనీల్‌కుమార్, శాప్ సీనియర్ కోచ్

సీసీఎఫ్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న సీసీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 9: అనంతపురం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్)గా యశోదాబాయి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ నాగేశ్వరరావు ఇన్‌చార్జ్‌గా ఉండే వారు. ఆయన బదిలీ కావడంతో రెగ్యులర్ సీసీఎఫ్‌గా మంగళగిరి ఆర్‌అండ్‌డీ సీసీఎఫ్‌గా ఉన్న యశోదాబాయిని నియమించారు.

సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ...

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 9: సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా ఉన్న ఆయన్ను అనంతపురం సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన సీసీఎఫ్ యశోదబాయిను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు, అక్టోబరు 9: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 15వతేదీ వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించినట్టు డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 8 జరగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 2326 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

గుత్తి మీదుగా సింగిల్ ట్రిప్ రైలు

గుంతకల్లు, అక్టోబరు 9: దసరా పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్-తిరుపతి (నం. 07474) మధ్య (వయా గుత్తి) సింగిల్ ట్రిప్ రైలును నడపనున్నట్టు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ఈ నెల 11న సికింద్రాబాదులో రాత్రి 8-05 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10-10 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా తిరుపతికి చేరుకుంటుందన్నారు.

జీడిపల్లికి 1028 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 9: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 1028 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం వెల్లడించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1115 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.631 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు.

నేటినుంచి పౌరాణిక నాటకోత్సవాలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 9: దసరా నవరాత్రులను పురస్కరించుకుని గురువారం నుంచి ఈనెల 13వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పౌరాణిక నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి అధ్యక్షుడు షేక్షావలీబాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాల్లో భాగంగా గురువారం తిమ్మాపురం గ్రామంలో బాలనాగమ్మ నాటకం, 11న రాప్తాడులో సత్యహరిశ్చంద్ర, 12న కసాపురంలో శ్రీకృష్ణ రాయబారము, 13న మన్నీల గ్రామంలో గయోపాఖ్యానము నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

16 నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 9: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్)లో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో అర్హులకు ఈ నెల 16 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు 09, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు 04, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు 71 ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన వారిలో అర్హులకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు ఈ నెల 16 ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ అభ్యర్థులకు 17న ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గం ఆర్డీఓ ఆఫీస్‌లో, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ అభ్యర్థులకు 18న ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉంటాయన్నారు.

జడ్పీలో మరో మాయ

17 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలు
పాత సీఈఓ పేరిట పాత తేదీతో ఉత్తర్వులు

అనంతపురం విద్య, అక్టోబరు 9: జడ్పీలో మాయలు కొనసాగుతున్నాయి. అర్ధరాత్రి బదిలీ ఉత్తర్వులిచ్చి చోద్యం చూసిన అధికారులు.. తాజాగా 17 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలను నియమించారు. పాత తేదీలతో బుధవారం కొత్తగా ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సీఈఓ వచ్చాక.. పాత సీఈఓ పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రూ.లక్షలు వసూలు చేశారని ఆరోపణలు వస్తున్నాయి. అయినా జిల్లా ఉన్నతాధికారులు నోరు విప్పడం లేదు. బదిలీల కారణంగా ఖాళీ అయిన ఎంపీడీఓ పోస్టులకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ), ఈఓఆర్డీలు, ఎంపీడీఓలను ఇన్‌చార్జిలుగా నియమించారు. బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా ఏవో నందకిషోర్, కంబదూరుకు ఎంపీడీఓ రామచంద్ర, కుందుర్పికి ఈఓఆర్డీ బాలాజీ, బొమ్మనహాళ్‌కు ఎంపీడీఓ దాస నాయక్, శెట్టూరుకు ఈఓఆర్డీ రఘురామారావు, వజ్రకరూరుకు ఎంపీడీఓ రవిప్రసాద్, చిలమత్తూరుకు ఏవో రమణమూర్తి, ఎన్పీకుంటకు ఈఓఆర్డీ అంజనప్ప, తలుపులకు ఏవో రామానాయక్, తనకల్లుకు ఏవో రెడ్డెప్ప, గుడిబండకు ఏవో గంగాధర్, పరిగికి ఈఓఆర్డీ శ్రీధర్‌రావు, రొద్దంకు ఏవో రాంకుమార్, కొత్తచెరువుకు ఈఓఆర్డీ నటరాజ్, నల్లమాడకు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, కనగానపల్లికి ఈఓఆర్డీ అనిల్ కుమార్, యల్లనూరుకు ఏవో వాసుదేవరెడ్డిని ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా నియమించారు. ఈ మేరకు ఎఫ్ఏసీ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే కొత్త సీఈఓ వచ్చారు. కానీ పాత సీఈఓ ఓబులమ్మ పేరుతో ఉత్తర్వులు బయటకు రావడం గమనార్హం. బదిలీల్లో గతంలోనే అనేక అక్రమాలు జరిగాయి. రూ.లక్షలు చేతులు మారాయి. తాజాగా పాత సీఈఓ పేరిట.. ఈ నెల 3వ తేదీ వేసి.. బుధవారం ఉత్తర్వులను బయటకు వదిలారు.



ఉత్తర్వులు రాక ముందే విధుల్లోకి..?

శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమితులైన ఒక ఏవో.. ఉత్తర్వులు రాక ముందే విధుల్లో చేరినట్లు సమాచారం. పాత తేదీతో ఉత్తర్వులు 9వ తేదీ జడ్పీ కార్యాలయం నుంచి బయటకు వచ్చాయి. ఆ ఏవో నాలుగు రోజులు ముందే మండలానికి వెళ్లి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నట్లు జడ్పీ ఉద్యోగుల్లో చర్చనడుస్తోంది. ఉత్తర్వులు జారీ చేయకనే ఒక అధికారిని విధుల్లో చేరాలని భరోసా ఇవ్వడం.. బేరసారాలు ఏ స్థాయిలో జరిగి ఉంటాయో చెప్పకనే చెబుతున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 60 శాతం ఫెయిల్


ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 9: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఆనర్స్ ద్వితీయ సెమిస్టర్‌లో 60శాతం మంది ఫెయిల్ అయ్యారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు బుధవారం ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మే నెలలో డిగ్రీ బీఏ, బీబీఏ, బీసీఏ, బీసీఎం, బీఎస్సీ ఆనర్స్ విద్యార్థులకు ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. 8551మంది విద్యార్థులకుగాను 3392మంది పాస్ అయ్యారని తెలిపారు. ఫలితాలకోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.500చొప్పున ఈనెల 24లోపు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లోకేషన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ సాయిశివ పాల్గొన్నారు.

జడ్పీ సీఈఓగా వెంకట సుబ్బయ్య



అనంతపురం విద్య, అక్టోబరు 9: జిల్లా పరిషత్ సీఈఓగా వెంకట సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా జడ్పీ సీఈఓగా, నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆర్.రామచంద్రారెడ్డిని అనంతపురం జిల్లాకు సీఈఓగా నియమించారు. అయితే ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న వెంకట సుబ్బయ్యను ఎఫ్ఏసీ సీఈఓగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన మధ్యాహ్నం సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మెడిసిన్ సీటు పేరుతో టోకరా

యాడికి, అక్టోబరు 9: ఫిలిప్పిన్స్ దేశంలో మెడిసిన్ సీటు ఇప్పిస్తామని రూ.3.5లక్షలు టోకరా వేసిన ఘటన యాడికిలో జరిగింది. బాధితులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. బాబా అనే వ్యక్తి వెల్డింగ్‌షాప్ నిర్వహిస్తుంటాడు. ఆయన కుమార్తె ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. ఆమెను వైద్య విద్య చదివించాలని తెలిసినవారి ద్వారా విజయనగరంలోని న్యూవే ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అనే ఏజెన్సీని సంప్రదించాడు. వారు మొదటి సంవత్సరం ఫీజు రూ.6.75 లక్షలు అవుతుందన్నారు. సీటు కన్ఫర్మేషన్ కోసం మొదట రూ.3.5లక్షలు చెల్లించాలని చెప్పడంతో ఆ మొత్తాన్ని నిర్వాహకులు గణేష్, రామారావులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. తర్వాత వారు కాలయాపన చేశారు. దీంతో వారిపై బాబా ఒత్తిడి పెంచాడు. ఈక్రమంలో సీటు కన్ఫర్మ్ అయినట్లు వారు ఓ లెటర్ పంపించారు. దీనిపై అనుమానం వచ్చిన బాధితుడు చెన్నైలోని కన్సల్టెన్సీని సంప్రదించారు. వారిద్వారా ఫిలిప్పిన్స్‌లోని కాలేజ్‌కు ఆ లెటర్‌ను పంపించారు. అది ఫేక్ లెటర్ అని తెలిసింది. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాబా నిర్వాహకులను నిలదీయగా వారు అతడిని బెదిరించారు. దీంతో సెప్టెంబరు 30న జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం యాడికి సీఐను కలిసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టమోటా కిలో రూ.50



అనంతపురం రూరల్, అక్టోబరు 9: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 900 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.24 పలికినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, అక్టోబరు 9: శ్రీ సత్యసాయి జిల్లా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈనెల 15లోగా ఆయా మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. జిల్లాలో కేజీబీవీలో టైప్ -3లో ఖాళీలు హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్‌లు 10, పగలు, రాత్రి వాచ్ ఉమెన్ 6, స్కావెంజర్ 4, స్వీపర్ 3, టైప్ -4 ఖాళీల వివరాలు చౌకీదార్ 5, హెడ్‌కుక్ 4, అసిస్టెంట్ 11 ఉన్నాయని ఆమె తెలిపారు.

మద్యం షాపులకు 1,686 దరఖాస్తులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 9: జిల్లాలో మద్యం షాపులకు ఇప్పటి దాకా 1,686 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 7 దాకా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. పబ్లిక్ డొమైన్ వెబ్ సైట్‌లో ఏపీ గెజిట్ నంబర్ మద్యం షాపులకు ఎన్ని దరఖాస్తు వచ్చాయన్న వివరాలు పొందుపరిచామన్నారు. https:hpfs-project.com వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారులు ఎన్ని దరఖాస్తులు పడ్డాయో చూసుకోవచ్చునన్నారు.

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

అనంతపురం అర్బన్, అక్టోబరు 9: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం తొమ్మిదో రోజు కొనసాగింది. ఇప్పటి దాకా 13,042 మంది రైతులు 18,250 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రైతులు ఈ అవకాశాన్ని వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 9: జిల్లాలోని పలు పీఎఫ్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం శ్రీధర్‌ఘట్ట గ్రామంలోని పద్మావతి, గోనేహాళ్ గ్రామంలో బసమ్మకు చెందిన పీఎఫ్ షాపులలో తనిఖీలు చేపట్టారు. రికార్డుల్లో ఉన్న వాటి కంటే అదనంగా ఉన్నట్లు తేల్చారు. నిలువలను జప్తు చేసుకొని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తనిఖీల్లో సీఐ జమాల్‌బాషా, ఏఓ వాసుప్రకాష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హౌసింగ్‌లో అక్రమార్కులపై వేటు !

- ఒక డీఈఈ, ఒక ఏఈ సస్పెన్షన్ • ఐదుగురిపై చార్జెస్ ఫ్రేమ్

అనంతపురం సిటీ, అక్టోబరు 9: జిల్లాలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ పరిధిలో నవరత్నాలు- పేదలందరికి ఇళ్ల పథకం కింద జరిగిన అక్రమాలకు కొందరు ఉద్యోగులను బాధ్యుల్ని చేస్తూ ఆశాఖ ఎండీ రాజబాబు చర్యలు తీసుకున్నారు. రూ. 2.08 కోట్లు అక్రమంగా బిల్లులు చేసినట్లు గుర్తించి ఒక డీఈఈ, ఒక ఏఈని సస్పెండ్ చేశారు. మరో ఐదుమందికి చార్జెస్ ఫ్రేమ్ చేశారు. దీంతో ఆశాఖలో అలజడి రేగింది. రాప్తాడు డీఈఈ కృష్ణారావు, ఏఈ వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేయగా.. మిగిలిన వారిలో రిటైర్డు డీఈఈ మహబూబ్‌బాషా, ఏఈలు రామ్మూర్తి, జమీల్ అహమ్మద్, కొండాభూషణ్, శ్రీనివాసులకు చార్జెస్ ఫ్రేమ్ చేశారు. ఇదే పరిధిలో పనిచేసిన మరో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఏఈలు, పలువురు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా...? లేక సర్వీస్ రీమూవ్ చేస్తారా..? అన్నది తెలియడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సచివాలయ ఉద్యోగుల కావడంతో వారిపై ఏమైనా శాఖ పరమైన చర్యలు తీసుకుంటారా..? అనే విషయాల్లో ఇంకా స్పష్టత రాలేదు. రాప్తాడు నియోజకవర్గంలోని జగనన్న ఇళ్ల రూపంలో జరిగిన అక్రమాల గురించి ఎమ్మెల్యే పరిటాల సునీత సీరియస్‌గా స్పందించడంతోనే.. ప్రభుత్వం, ఆశాఖ ఎండీ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. ఇక రాక్రీట్ అక్రమాలు విజిలెన్సు విచారణలో ఎన్ని బయటపడతాయోనని ఆశాఖ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

దోపిడీ చేసి విమర్శలా..?

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


మీడియాతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వంద రోజుల్లో చేసిన అభివృద్ధి పనులను ఓర్వలేక వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శలు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు దోపిడీ చేశారని అన్నారు. ఇసుక విధానంలో ఎన్ని రూ.వేల కోట్లు దండుకున్నారో ప్రజలు మరిచిపోలేదని అన్నారు. వైసీపీ ఓటమికి ఆ దోపిడీనే కారణమని అనంత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మద్యం కుంభకోణంలో వైసీపీ పెద్దలు ఎంతెంత దండుకున్నారో తేటతెల్లమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. వైసీపీ హయాంలో ఇసుక కోసం సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నిర్మాణ రంగాన్ని నమ్ముకున్న కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. ఈ విషయాలు తెలిసి కూడా ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని అన్నారు. పాలనను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కొంత సమయం తీసుకుంటున్నారని, ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అన్నారు. వంద రోజుల పాలనలో వేల కోట్లు దండుకున్నారని విమర్శించడం అనంతకు తగదని అన్నారు. ఉచిత ఇసుక విధానంలో రవాణా, లోడింగ్ చార్జీలు మాత్రమే ప్రజల నుంచి తీసుకుంటున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తరహాలో మద్యం విక్రయించి దోచుకోవడం తమ ప్రభుత్వం విధానం కాదని అన్నారు. మద్యం వ్యాపారం చేయాలనే ఉత్సాహం ఉన్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును తమ ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు టెండర్లు వేయకుండా బెదిరిస్తున్నారనే ఆరోపణలు అవాస్తవమని అన్నారు. బురదజల్లేందుకే అనంత వెంకటరామిరెడ్డి వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంబులపూలకుంట, అక్టోబరు 9 : స్థానిక కస్తూర్బాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఈనెల 15లోపు మండలానికి చెందిన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంటసహాయకులు -2 , కాపలదారులు -1 1, స్వీపర్ -1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, కేవలం మండలానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో ట్రైల్ 4 కేజీబీవీ పాఠశాలను నూతనంగా ప్రారంభిస్తున్నామని ఎంఈఓ క్రిష్ణానాయక్ బుధవారం తెలిపారు. అందులో వంటమనిషి, సహాయకులు, వాచ్ మన్ పోస్టులకు స్థానిక మహిళలు ఈనెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మండల అభివృద్ధిపై శిక్షణ

ముదిగుబ్బ, అక్టోబరు 9 : మండల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిధిలోని ఉప సర్పంచులు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లు ఇందులో పాల్గొన్నారు. గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించుట, గ్రామ పంచాయతీ పరిపాలన, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్డీ దివాకర్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : గ్రామాల అభివృద్ధిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు నిర్వహించే శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ పోలప్ప పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ప్రభుత్వ నిధులు వినియోగం గురించి సూచినలు, సలహాలు ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

నంబులపూలకుంట, అక్టోబరు 9: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ప్రభుత్వ పథకాలపై ఈఓఆర్డీ మాధవరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. ఉన్న వనరులను వినియోగించుకొని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది జకావలీ, సురేష్, రమేష్, పవన్‌కుమార్, లవకుమార్, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నల్లమాడ, అక్టోబరు 9 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ సునితాబాయి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈసమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నాలని కోరారు.

లోతు దుక్కితో చీడపీడలకు చెక్

నంబులపూలకుంట, అక్టోబరు 9 : రబీలో బోరుబావుల కింద సాగు చేసుకునే రైతులు లోతు దుక్కిలు దున్నితే పీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ధనియాన్‌చెరువు, బందార్లచెట్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మట్టి నమూనాలు, మల్చింగ్ విధానం, పొలాలకు చెరువు మట్టి తరలించడం, పొలాలకు గట్లు నిర్మించుకోవడం, వీలుంటే ఎకరం పొలంలో రెండు సెంట్లు ఫారంపాండ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవా మృతం తయారీ విధానాన్ని వివరించారు.

జీఓ నెంబరు 117 రద్దు చేయాలి

పుట్టపర్తి, అక్టోబరు 9 : జీఓ 117ను రద్దు చేయాలని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని వైఎస్ఆర్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన ఉపాధ్యాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, డీఏలు చెల్లించాలని, విద్యయేతర కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి, రాజగోపాల్, కిష్టప్ప, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బంది

ఉత్సాహంగా ఆర్ట్ ఫెస్టివల్

నల్లమాడ, అక్టోబరు 9: స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఏరియా లేవల్ ఆర్ట్ ఫెస్టివల్‌ను ఏటీఎల్ వన్నూరప్ప ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇందులో నల్లమాడ, ఓడీ చెరువు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రంగోలీ, క్లేమోడల్, పెయింటింగ్, పెపర్ కటింగ్, న్యాచురల్ కోలాజ్, హ్యాండ్ రైటింగ్‌కు సంబంధించి పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులు వచ్చే నెల 14న అనంతపురంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేమనారాయణ, ఆర్డీటీ సిబ్బంది శ్రీనివాసులు, గంగప్ప, నరసింహులు, రాజశేఖర్, కుళ్లాయమ్మ పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



కదిరి అర్బన్, అక్టోబరు 9: ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో జరగనున్న అంతర్ జిల్లా అండర్ 14 క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారులు రోహిత్, భువన్ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సభ్యులు పవన్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, కోచ్ నజీర్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

కేసులపై ఎస్పీ సమీక్ష



ఎస్పీకి పూలమొక్క అందచేస్తున్న డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 9 : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో డిస్ట్రిక్ట్ క్రైం బ్రాంచ్ విభాగం సిబ్బందితో ఎస్పీ వీ రత్న బుధవారం పలు కేసులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో క్రైం కేసులు, ఎస్సీ ఎస్టీ లోకాయుక్త, రౌడీషీటర్లు, బోర్డర్ పోలీసు స్టేషన్లో జరిగే అన్నిరకాల క్రైంలు, ఫ్యాక్షన్ గ్రామాలపై సమీక్ష చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో క్రైం బ్రాంచ్ అత్యంత కీలకమని అన్నారు. జిల్లాలో జరిగే నేరాలపై ముందుస్తుగా స్పెషల్ క్రైం బ్రాంచ్ సిబ్బంది తెలుసుకొని.. అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందికి సమాచారం చేరవేయడంతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. ప్రధాన కేసుల దర్యాప్తులో క్రైం బ్రాంచ్ సిబ్బంది టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఐటీకోర్ టీం సిబ్బంది సుదర్శనరెడ్డి, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన డీఎస్పీ: పుట్టపర్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీ విజయ్‌కుమార్ జిల్లా ఎస్పీ వీ రత్నను మర్యాదపూర్వకంగా బుధవారం కలసి పూల మొక్క అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డీఎస్పీకి పలు సూచనలు ఇచ్చారు.

టపాసుల లైసెన్స్‌ల జారీపై సమావేశం

ధర్మవరం, అక్టోబరు 9 : టపాసులు, ఫైర్ వర్క్స్ లైసెన్స్‌ల జారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో ఆర్డీఓ మహేశ్ బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీఎస్పీ శ్రీనివాసులు, ఫైర్ ఆఫీసర్లు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ కార్యకలాపాలపై చర్చించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చెత్త పన్నుకు చెల్లు..!

- వైసీపీ పాలనలో ప్రజలపై భారం
- వ్యతిరేకించినా పట్టించుకోని నాటి పాలకులు
- పన్నుకు.. పథకాలకు లింక్ పెట్టి మరీ వసూళ్లు
- హామీ అమలులో భాగంగా రద్దు చేసిన నేటి కూటమి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కాదేదీ కవితకు అనర్హం అని ఓ మహా అన్నట్లు.. కాదేదీ పన్నుకు అనర్హమని గత వైసీపీ ప్రభుత్వం అంది. అనడమే కాకుండా అమలు చేసి కూడా చూపింది. అందులో ఒకటి చెత్త పన్ను. నాడు ప్రజలు తీవ్రంగా దీన్ని వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోలేదు. మొండిగా వ్యవహరించింది. అంతేకాకుండా పన్ను చెల్లించకుంటే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని బెదిరించి మరీ వసూలు చేసింది.

ధర్మవరం, అక్టోబరు 9 : ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పాలించిన గత వైసీపీ ప్రభుత్వం.. సామాన్యుడిపై చిత్ర.. విచిత్ర పన్నుల భారం మోపింది. అందులో చెత్త పన్ను ఒకటి. చెత్త సేకరణపై పన్ను విధించరాదని పేద, మధ్య తరగతి ప్రజలు నాడు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా వైసీపీ ప్రభుత్వం మొండిగా ఆ భారం ప్రజలపై మోపింది. దీనిపై నాడు ప్రజలను నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఒక్క ధర్మవరం మున్సిపాలిటీలో 36 వేల గృహాలుండగా ఇందులో 1.50 లక్షల మంది ఉన్నారు. ఇంటికి రూ.60, దుకాణాలకు, హోటళ్లకు రూ.100 నుంచి రూ.120 చొప్పున వైసీపీ ప్రభుత్వం వసూలు చేసింది. ఇలా నెలకు చెత్త పన్ను రూపంలో రూ. 11 లక్షలు వసూలు చేసింది.

అనాలోచిత నిర్ణయాలు

వైసీపీ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలపై అధిక భారం మోపింది. ఇంటింటికి చెత్త సేకరణ కోసం వైసీపీ ప్రభుత్వం క్లాప్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఆ వాహనాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించేలా ర్ణయం తీసుకుంది. దీంతో ఆ భారం ఆయా స్థానిక సంస్థలకు తలకు మించిన భారంగా మారింది. దీంతో ఆ భారాన్ని ప్రజలపై వేశారని అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ధర్నాలు చేశాయి. అయినా వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి మరీ చెత్త పన్నును ముక్కుపిండి వసూళ్లు చేయించిన ఘనత వైసీపీకే దక్కింది. ఎవరైనా చెల్లించకపోతే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బయపెట్టడంతో చేసేది లేక పేద, మధ్య తరగతి ప్రజలు చెత్త పన్నును చెల్లించేవారు. గతంలో దేశంలో... ఏ ప్రభుత్వమూ.. చెత్త పన్ను వేయలేదని, మాజీ సీఎం జగన్ చెత్తపై పన్ను వేసి చెత్త ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు.



హామీ నిలుపుకున్న కూటమి

తాము అధికారంలోకి రాగానే చెత్త పన్ను లేకుండా చేస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే గాంధీ జయంతి సందర్భంగా చెత్త పన్నును పూర్తిగా తొలగిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో పేద, సామాన్య ప్రజానీకం ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట నిలుపుకున్న బాబు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్నును రద్దు చేసి సీఎం చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారు. తాము కూలీ పనులు చేస్తూ కాస్తో కూస్తో వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. అయితే చెత్త పన్ను విధించడంతో నెలకు రూ.60 చొప్పున వసూళ్లు చేయడం దారుణం. ఈ చెత్త పన్ను రద్దుతో తమకు కొంత ఊరట కలిగింది.

- బాబావలి, తారకరామాపురం

వైసీపీ పాలనలో ఇబ్బందులు



గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారూ ఇబ్బందులు పడ్డారు. పేదల ప్రభుత్వమని పేదల అభివృద్ధి కోసమే తాము పాటు పడుతున్నామని గొప్పలు చెప్పిన మాజీ సీఎం జగన్ అధికారంలోకి రాగానే ప్రజలపై అనేక పన్నుల భారం మోపారు. ప్రతి దానిపై పన్నులు వేశారు. ప్రస్తుతం ఈ చెత్త పన్నును ఈ ప్రభుత్వం తొలగించడం సంతోషం.

- నరేశ్, ధర్మవరం

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ సత్యనారాయణ

తనకల్లు, అక్టోబరు 9: ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం చిరు ధాన్యాల శాస్త్రవేత్త నరసింహులు, కీటకాల శాస్త్రవేత్త రమేష్‌నాయక్, ఏడీ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని కొత్తకురవపల్లి (గొల్లపల్లి)లో జన జాగృతి వ్యవస్థాపకుడు బలరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు క్షేత్ర దినోత్సవంలో వీరు పాల్గొన్నారు. మొదటగా వీరు రాయలసీమ వాటర్ ఇన్‌సెటీవ్ ప్రాజెక్టులో భాగంగా రైతులు సాగుచేసిన వివిధ రకాల చిరుధాన్యాపు పంటలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన రైతు క్షేత్ర దినోత్సవంలో వారు మాట్లాడారు. రైతులు విరివిగా క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు ఉపయోగించడం వల్ల నేల ఆరోగ్యం చెడి పోయిందన్నారు. దీంతో ప్రస్తుతం 40 సంవత్సరాలలోపే ప్రజలు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని, గర్భవతులు రక్తహీనతతో బాధపడుతున్నారని వివరించారు. తాతల కాలం నాటి వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరి నాయక్, వాసన్, ఎపీ మాస్ ప్రతినిధులు ఉత్తప్ప, వాసుదేవరెడ్డి, ఆత్మా ప్రతినిధి మౌనిక, పశువైద్యాధికారి విజయ కుమార్ నాయక్, ముక్తియార్ బాషా, ఎన్ఎఫ్ ప్రతినిధి సుప్రియ పాల్గొన్నారు.

రేపటి వరకూ అవకాశం

అనంతపురం అర్బన్ : ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 11వతేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈనెల 14న లాటరీ తీసి, దుకాణాలను కేటాయిస్తామని తెలి పారు. ఈ నెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రారంభి స్తామన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహి కులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హిందూపురం, అక్టోబరు 9 : స్థానిక సరస్వతి టాకీస్ ప్రాంతంలో నివాసముంటున్న ఆదినారాయణ కుటుంబ తగాదాలతో మంగళవారం అర్థరాత్రి సమయంలో గుడ్డం సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. కుడిచేయి, తలకు బలమైన గాయాలయ్యాయి. తెల్లవారుజామున 3 గంటల సమయంలో లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

ధర్మవరం, అక్టోబరు 9: ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పత్రికలు పనిచేయాలని చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, ఆయన సోదరుడు సంధారవీంద్ర సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో సంధారాఘవ కుమార్తె సంధాశ్రీనిత పుట్టిన రోజు, దసరా పండుగను పురస్కరించుకుని పాత్రికేయులకు బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. అవినీతి, అక్రమాలను అరికట్టడంతో పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి తమవంతుగా రూ. ఐదు లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మాంగళ్య శిల్క్ యజమాని జింకాపురుషోత్తం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్, ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్, చందు, సాయి, కొడవండ్లపల్లిహరి పాల్గొన్నారు.



కుమార్తెకు కేక్ తినిపిస్తున్న సంధారాఘవ

శిథిలావస్థలో గ్రంథాలయం

- పాతపంచాయతీ భవనంలోకి మార్పు
- అసౌకర్యాలు.. ఇరుకు గదిలో నిర్వహణ
- పాఠకులకు తప్పని ఇక్కట్లు

తాడిమర్రి, అక్టోబరు 9 : స్థానిక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడి పడుతుండటంతో పాఠకులు గ్రంథాలయానికి వెళ్లడానికి జంకేవారు. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం వానొస్తే మొత్తం కారుతుండటంతో పుస్తకాలను కాపాడుకోవడానికి అధికారులు నానా పాట్లు పడేవారు. ఈ సమస్యను పాఠకులు, స్థానికులు పలుమార్లు గతంలో వైసీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో స్థానికులే గ్రంథాలయాన్ని పాతపంచాయతీ భవనంలోకి సుమారు 18 నెలల క్రితం మార్చారు. అయితే అందులో తగిన సౌకర్యాలు లేవు. ఆ భవనమూ వానొస్తే కారుతోంది. భవనం చాలా ఇరుకుగా ఉండటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వారు కూర్చోడానికి తగినంత స్థలం లేదు. ఇప్పటికైనా నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించేలా పాలకులు, అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



పాత భవనం, పెచ్చులూడిన కప్పు (ఇన్‌సెట్లో)



ప్రస్తుతం గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న ఇరుకు గది

పుస్తకాలు తడిసిపోతున్నాయి



వర్షం వచ్చిందంటే చాలు ఇప్పుడున్న భవనమూ మొత్తం కారుతోంది. పుస్తకాలు తడిసిపోతున్నాయి. విలువైన వస్తువులు దెబ్బతింటున్నాయి. గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలి. పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. యువతకు పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు కూడా తెప్పించాలి.

- శంకరగౌడ్, తాడిమర్రి

భవనాన్ని నిర్మించాలి



గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పాఠకులకు తగిన సౌకర్యాలతో అనువైన స్థలంలో నిర్మిస్తే గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య కూడా పెరుగుతుంది. విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆ విధంగా ఇప్పటి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాసులు, పాఠకుడు

గుండెపోటుతో ఆర్‌అండ్‌బీ ఉద్యోగి మృతి



బావాజీ (ఫైల్)

ముదిగుబ్బ, అక్టోబరు 9 : అనంతపురంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ బావాజీ (33) బుధవారం గుండెపోటుతో మరణించాడు. ఆయన స్థానిక బాలాజీ కాలనీలో నివాసముండేవారు. ముదిగుబ్బలో నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం ద్విచక్ర వాహనంలో బస్టాండ్‌కు వెళుతుండగా సొసైటీ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కింద పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన స్థానిక ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాబాజీకి తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటిపెద్దను కోల్పోవడంతో భార్యా, పిల్లలు బోరున విలపించారు.

ఉపాధి కూలీ...

నంబులపూలకుంట, అక్టోబరు 9: మండలంలోని గౌకనపల్ల గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మస్తాన్ బీ (52) గుండెపోటులో బుధవారం మరణించింది. రోజులాగే బుధవారం కూడా మస్తాన్‌బి కూలి పనులకు వచ్చింది. పని చేస్తుండగా గుండె పోటు రావడంతో వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో కదిరికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె భర్త మహమ్మద్‌బాషా గతంలోనే మరణించాడు. ఇద్దరు కుమారులున్నారు.

వైసీపీ వర్గీయుల ఘర్షణ



గాయపడిన ఓబిలేసు

ధర్మవరం, అక్టోబరు 9 : పట్టణంలోని మొదటి వార్డులోని గూడ్‌షెడ్ కొట్టాలలో పట్టాలు పంపిణీ చేసిన భూమిలో వైసీపీ వర్గాల మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ భూమిలో తమకు వాటా ఉందని చిన్నలింగప్ప, చిన్న ఓబిలేసు, బాలప్ప, ఓబిలేసు, బాల వెంకటేశ్ మరో వర్గానికి చెందిన మల్లి, సతీశ్, తిరుపాలు, రామాంజి, కిరణ్‌కుమార్, వినోద్ వాగ్వావాదానికి దిగారు. చిన్నలింగప్ప వర్గీయులపై మల్లి వర్గం కర్రలతో దాడి చేసింది. దీంతో గాయపడ్డ ఆ ఐదుగురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ స్థలం కొన్నేళ్లుగా వివాదంలో ఉందని, ప్రస్తుతం అది కోర్టులో నడుస్తోందని, ఇటువంటి తరుణంలో ఎవరూ ఈ స్థలం జోలికి వెళ్లరాదని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రెడ్డెప్ప



తనకల్లు : మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రెడ్డెప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ ఓడీసీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఓడీసీ ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రెడ్డెప్పను తనకల్లు ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు.

సరస్వతి దేవి అలంకరణలో..

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన బుధవారం పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కదిరి : మరకత మహాలక్ష్మి





ధర్మవరం : వాసవీమాత, లక్ష్మీచెన్నకేశవపురంలోని పార్క్‌లో..

అడుగడుగునా గుంతలు

- అధ్వానంగా రైల్వే స్టేషన్ దారి
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


నడిరోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


కంకర తేలిన రోడ్డు



పెనుకొండ రైల్వే స్టేషన్

పెనుకొండ టౌన్, అక్టోబరు 9 : పదుల సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగించే పెనుకొండ రైల్వేస్టేషన్‌కు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఈ రహదారి 400 మీటర్లు ఉంటుంది. దారి పొడవునా సుమారు 46 గుంతలు కంకరతేలి అధ్వానంగా మారింది. మురుగు నీరు గుంతల్లో నిండి ప్రయాణికులకు మరింత ఇబ్బందికరంగా తయారయింది. పెనుకొండ అంటేనే పర్యాటక ప్రాంతంగా పేరుగాంచింది. ఈ స్టేషన్ నుంచి బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, తదితర ప్రాంతాలకు 22 రైళ్లు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఉద్యోగులు నిరంతం వచ్చి వెళ్తుంటారు. ప్రయాణికులు ప్రఖ్యాతి గాంచిన దర్గా దర్శనార్థం పెనుకొండకు వస్తుంటారు. స్టేషన్ నుంచి పట్టణానికి వచ్చే సమయంలో ఆటోల్లో ప్రయాణం కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో గుంతల్లో అదుపుతప్పి ఆటోలు ప్రమాదాలబారిన పడిన సంఘటనలు ఉన్నాయి. ఇక కాలినడక వెళ్లే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రోడ్లు మురుగు నీటితో ఉండటంతో వాహనాలు వెళ్లేటప్పుడు ఆ నీరు ప్రయాణికులపై ఎగిరిపడుతుంటుంది. గత వైసీపీ పాలనలో పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నారు. అయినా ఒక్క ట్రాక్టర్ మట్టి తోలిన పాపానపోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుత మంత్రి సవిత అయినా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, రైల్వే క్వార్టర్స్‌లో నివాసమున్న స్థానికులు, ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

నివేదికలు తయారు చేస్తాం : శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్



నగర పంచాయతీ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్‌కు సంబంధించిన రోడ్డు నిర్మాణ పనులకు నివేదికలు తయారుచేస్తాం. మా శాఖకు చెందిన ఇంజనీర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఇంకా నియామకం జరగలేదు. ఆ పోస్టులోని వ్యక్తి వస్తూనే నిబంధనల మేరకు నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం. అంతవరకు ఏమీ చేయలేం. ఇదే తరహాలో పలు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు





హిందూపురంలో మహాకాళరాత్రి దేవిగా కొల్లాపురమ్మ, చదువులతల్లిగా.. వాసవీమాత, పెనుకొండలో కన్యకాపరమేశ్వరి, మడకశిరలో వడిసిలమ్మ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలతో ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లాపురమ్మ దేవాలయంలో అమ్మవారిని మహాకాళరాత్రి దేవిగా ముస్తాబుచేశారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాతను సరస్వతిదేవిగా తీర్చిదిద్దారు. నింకంపల్లి రోడ్డులో ఉన్న యల్లమ్మ ఆలయంలో అమ్మవారు చదువుల తల్లిగా కొలువుదీరారు. కోటిపి రోడ్డులోని బెస్త సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ దేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ప్రసిద్ద పేట వేంకటేశ్వర ఆలయంలో శ్రీరామచంద్రమూర్తిగా తీర్చిదిద్దారు. పెనుకొండలో మూలానక్షత్రం సందర్భంగా పలు ఇళ్లలో బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవి రూపంలోనూ, లక్ష్మీవెంకటరమణస్వామిని బలరామ రూపంలో అలంకరించారు. చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో మహేశ్వరి అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు శక్తిపీఠం వ్యవస్థాపకుడు దేవేంద్ర స్వామి తెలిపారు. మడకశిర పట్టణంలో కన్యాకాపరమేశ్వరి, వడిసిలమ్మ సరస్వతీదేవి అలంకరణలో కొలువుదీరారు. రాత్రి దుర్గాదేవి హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగాభవాని, కొల్లాపురమ్మ తదితర దేవాలయాల్లో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి : కమిషనర్

హిందూపురం, అక్టోబరు 9 : పట్టణం అభివృద్ధి చెందాలంటే రోడ్లు వెడల్పుగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తమశాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి చేయాలంటే అధికారుల సమన్వయం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ఇరుకు రహదారులవల్ల నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైల్వే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు అధికారులు అందించాలన్నారు. ఇప్పటికే రైల్వే రోడ్డులో కొన్ని భవనాలు తొలగించారని, మిగిలిన వాటిని కూడా త్వరలోనే తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సంబంధితశాఖాధికారులు పనులు చేపట్టే సమయంలో సమన్వయంతో ముందుకు రావాలన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌రహదారి నుంచి బైపాస్ రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనాన్ని తొలగించేందుకు ముందుకెళ్తున్నామన్నారు. భవనాలు తొలగించే సమయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు రోడ్డు వెడల్పు సందర్భంలో విద్యుత్ స్తంభాలు మార్చాలన్నారు. రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్లను నిబంధనల ప్రకారం అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు పొంది తొలగించాలన్నారు. ఇరిగేషన్ డీఈ యోగానంద్ మాట్లాడుతూ పట్టణంలోని సూరప్పకుంట నుంచి కిందకువెళ్లే నీటి కోసం ఏర్పాటు చేసిన కాలువ కొంతమంది దురాక్రమణ చేశారని వివరించారు. దీనివల్ల మున్సిపల్ అధికారులు కాలువ పనులు చేపట్టే సమయంలో ఇరిగేషన్ స్థలంలో తగ్గించి కాలువ ఏర్పాటు చేశారని తెలిపారు. కొట్నూరు చెరువుకు వచ్చే కట్టకాలువ ఇరువైపులా సుమారు 200మందికిపైగా ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి భవనాలు నిర్మించుకున్నారని అన్నారు. వారంతా స్వచ్ఛందంగా తొలగించుకోకపోతే నోటీసులు అందజేసి కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశులు, డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, ఏసీపీ సునీల్‌రాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పంటల నమోదును పరిశీలించిన జేసీ

గోరంట్ల, అక్టోబరు 9: మండలంలో రైతులు సాగుచేసిన పంటలను వ్యవసాయాధికారులు నమోదు చేశారు. ఈ ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం పరిశీలించారు. గోరంట్ల సమీపంలో సిరగమవాండ్లపల్లి, పాలసముద్రం, మల్లాపల్లి, వెంకటరమణపల్లి, పులేరు, కొండాపురం, తాటిమేకలపల్లి, మలసముద్రం, గౌనివారిపల్లి ప్రాంతాల్లోనే మొత్తం పదిచోట్ల పంట సాగును పరిశీలించారు. యాప్ ద్వారా పంటల నమోదు ప్రకియతోపాటు రైతులతో పంట సాగు, తదితర విషయాలపై జేసీ చర్చించారు. గోరంట్లలో విజయేంద్రప్రసాద్ సాగుచేసిన టమోటా పంటను పరిశీలించి దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టమోటా కిలో రూ.100 ఉన్నప్పటికి బాగేపల్లి మార్కెట్‌లో కమీషన్, దళారీ మొత్తం పోనూ తమకు కిలోకు రూ.30 వస్తోందని రైతు తెలిపారు. మార్కెట్‌వారే పొలం వద్దకు వాహనాన్ని పంపి, తీసుకెళ్తున్నరని చెప్పారు. ఆయనతోపాటు తహసీల్దార్ మారుతి, హిందూపురం అగ్రికల్చర్ ఏడీ అల్తాఫ్‌అలీఖాన్, ఏఓ మునిక్రిష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


టమోటా సాగుచేసిన రైతులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ అధికారులు, సిబ్బంది

హిందూపురం అర్బన్, అక్టోబరు 9: వ్యాయమంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పోస్టల్ ఏఎస్పీ మల్లికార్జున తెలిపారు. బుధవారం పట్టణంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌పోస్ట్ ఫిట్ ఇండియా అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోస్టల్ సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నపుడే సక్రమంగా విధులు నిర్వహించగలరని అన్నారు. ఇందుకోసం రోజూ క్రమం తప్పకుండా వ్యాయమం, యోగా, నడక లాంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ మార్కండేయులు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే వెంకటేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీడీఓలు, సిబ్బంది

పావగడ, అక్టోబరు 9 : తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని గ్రామ పంచాయతీ పీడీఓలు, కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్‌కలెక్టర్లు బుధవారం స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. గడిచిన వారం రోజుల నుంచి తుమకూరు జిల్లా కేంద్రంలో వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది కొరతతో పనులు చేయలేకపోతున్నామని, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి విధులు నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు.

దసరాకు కందిపప్పు లేనట్లేనా..?

- డీలర్ల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- స్పందించని అధికారులు

మడకశిర రూరల్, అక్టోబరు 9 : దసరా పండుగ నేపథ్యంలో ప్రస్తుత కోటాలో రేషన్ సరుకులతో పాటు కంది పప్పు కూడా సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇంత వరకు రేషన్ కార్డుల లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేయలేదు. ఇప్పటి వరకు ఎఫ్‌పీ షాపుల్లో బియ్యం, చక్కెర, జొన్నలు మాత్రమే ఇచ్చారు. 80 శాతం పంపిణీ కూడా పూర్తయింది. కందిపప్పు మాత్రం ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. దసరా పండుగ కావడంతో అందరిచూపు కందిపప్పుపైనే ఉంది. ప్రతి నెల 1 నుంచి 15 వరకు ఎఫ్‌పీషాపుల్లో నిత్యవసర సరుకులు అందిస్తారు. ఇక ఐదు రోజులు మాత్రమే సమయం ఉంది. మండలంలో 60 ఎఫ్‌పీ షాపులు, 25,606 రేషన్‌కార్డులు



కార్డుల్లో 35 శాతం మందికి మాత్రమే పంపిణీ చేయగలమని తెలిపారు.

ఉన్నాయి. పండుగ కావడం, కందిపప్పు మార్కెట్‌లో అధిక ధరలు ఉండడంతో చాలా మంది లబ్ధిదారులు రోజూ డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎఫ్‌పీ షాపులకు కందిపప్పు వచ్చినా డీలర్లు పంపిణీ చేయడంలేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. మరికొన్నిచోట్ల డీలర్లను నిలదీస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ హారతిని వివరణ కోరగా. ఎఫ్‌పీ షాపుల్లో ఇప్పటి వరకు బియ్యం, చక్కెర, జొన్నలు పంపిణీ చేశారని తెలిపారు. కందిపప్పు ఆలస్యంగా, చాలా తక్కువగా సరఫరా అయిందన్నారు. మొత్తం

టీడీపీ నాయకుడికి ఎంపీ పరామర్శ

గోరంట్ల, అక్టోబరు 9: పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు పసుపులేటి శ్రీనివాసులు తండ్రి వెంకటేశప్ప (85) మృతి చెందడంతో ఎంపీ పార్థసారధి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో వెంకటేశప్ప మృతిచెందారు. మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మంత్రి సవిత భర్త, టీడీపీ నాయకులు వెంకటేశ్వరావు మృతదేహన్ని సందర్శించి నివాళుర్పించారు. వైసీపీ నాయకుడు మాల గుండ్లమల్లికార్జున శ్రీనివాసుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, ఉమ్మర్‌ఖాన్, నీలకంఠరెడ్డి, జయచంద్ర, మనోహర్, బాలక్రిష్ణ, వెంకటరెడ్డి, నిమ్మల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హిందూపురం, అక్టోబరు 9 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన గుడ్డం సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సరస్వతి టాకీస్ ప్రాంతంలో నివాసముంటున్న ఆదినారాయణ అనే వ్యక్తి కుటుంబ తగాదాలతో మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుడ్డం సమీపంలో అనంతపురం వైపు వెళ్తున్న రైలుకిందపడ్డాడు. కుడిచేయి, తలకు బలమైన గాయాలయ్యాయి. తెల్లవారుజామున 3 గంటల సమయంలో లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలతో ఉన్న బాధితుడిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అయన అపస్మారకస్థితిలో ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

నోటుపుస్తకాలు, పెన్నుల పంపిణీ

లేపాక్షి, అక్టోబరు 9 : దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా లేపాక్షి దుర్గాదేవి అమ్మవారు బుధవారం సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి విద్యార్థులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నూ, పెన్సిళ్లను అందించారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల కల నెరవేర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పాము కాటుతో వృద్ధుడికి అస్వస్థత

గోరంట్ల, అక్టోబరు 9: పట్టణంలోని మూడో వార్డుకు చెందిన వృద్ధుడు నంజుడప్పకు బుధవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యారు. అతడు పొలంలో కట్టెలు మోపు కట్టి తీసుకు వస్తుండగా అందులో ఉన్న కట్ల పాము కుడిచేతిపై కాటువేసింది. అస్వస్థత చెందడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ఉషా చిక్సితలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం పంపించారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అగళి, అక్టోబరు 9 : మండలంలోని కేజీబీవీ హాస్టల్ సహాయక వంట మనిషి పోస్టు ఖాళీగా ఉందని, మోడల్ స్కూల్ హాస్టల్‌లో చౌకిదారు పోస్టు ఖాళీగా ఉందని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. పై రెండు పోస్టులకు మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అప్లికేషన్ నెట్ సెంటర్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తీచేసి ఎంఈఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. దరఖాస్తు ఫారం ఈనెల 15న సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని తెలిపారు.

విధులకు వెళుతూ.. గుండెపోటుతో మృతి



మడకశిర రూరల్, అక్టోబరు 9 : మండలంలోని గుర్రపుకొండ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న రంగనాథ్ (46) బుధవారం విధులకు వెళుతూ గుండెపోటుతో మృతి చెందారు. ఏపీసీఎన్ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్ మాట్లాడుతూ రంగనాథ్ అమరాపురం మండలం తమ్మిదేపల్లిలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అతడికి భార్య, కూతురు, కూమారుడు ఉన్నారు. ఉదయం స్వగ్రామం గుర్రపుకొండ నుంచి ద్విచక్రవాహనంలో వేళతుండగా గ్రామ సమీపంలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు భార్య జయమ్మ, కుటుంబసభ్యులు తెలిపారు.

మద్యం షాపులకు 37 దరఖాస్తులు

మడకశిరటౌన్, అక్టోబరు 9 : నియోజకవర్గంలో మద్యం దుకాణాల లైసెన్స్ కోసం 37 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ టిప్రసాదరావు తెలిపారు. మడకశిరలో 10, రొళ్ల 3, అమరాపురం 5, అగళి 4, గుడిబండ మండలంలో 15 వైన్ షాపులకు దరఖాస్తు చేసుకొన్నట్లు తెలిపారు. వీటితో పాటు ఆన్‌లైన్ ద్వారా మరిన్ని దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

లేపాక్షి, అక్టోబరు 9 : ఈనెల 14నుంచి ప్రతి పల్లెలోనూ పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. ఉపాధి పనుల్లో నిధులను వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యాలను వేస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

సేంద్రియ ఎరువులు వాడండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగళి, అక్టోబరు 9 : రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని అగళి, ఇరిగేపల్లి గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఆయన రైతులతో సమావేశాలు నిర్వహించారు. పట్టుపరిశ్రమ శాఖ అధికారులు మల్బరీ షెడ్లు, పథకాల గురించి అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ వారు పశువులకు బీమా ఉందని, మందులుకూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, సర్పంచ్ హనుమంతరాయప్ప, ఉప సర్పంచ్ మంజునాథ్, ఇరిగేపల్లి సర్పంచ్ లక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ హేమంతరాజు, నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలోని తమ్మడేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు హాజరై వారి శాఖల పరిధిలో జరుగుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజునాథ్, సెరికల్చర్ అధికారి వేణుగోపాల్ నాయక్ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు

అంబేడ్కర్ భవనానికి నిధులు మంజూరు చేయండి


ఎంపీ బీకే పార్థసారథిని సత్కరిస్తున్న పరిగి నాయకులు

పెనుకొండ, అక్టోబరు 9 : అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎస్సీ సంఘాల నాయకులు ఎంపీ బీకే పార్థసారథికి విన్నవించారు. బుధవారం పెనుకొండలోని ఎంపీ కార్యాలయానికి వచ్చిన వారు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వినతి పత్రం అందిస్తూ.. పరిగిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎంపీ ఇప్పటికే టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు రొద్దంలో అంబేడ్కర్ భవననిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారని, అందరి అభిప్రాయం మేరకు నియోజకవర్గంలో ఒకచోట భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

రహదారికి టీడీపీ నాయకుల మరమ్మతులు


రహదారిపై మట్టితో చదును చేయిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, అక్టోబరు 9: మండలంలోని హిందూపురం ప్రధాన రహదారిపై పాలసముద్రం వద్ద రోడ్డు దెబ్బతినడంతో బుధవారం టీడీపీ నాయకులు మట్టి తోలి మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో స్థానికులు సోషల్ మీడియా ద్వారా తీవ్ర విమర్శలు చేయడంతో టీడీపీ నాయకులు స్పందించారు. 13 ట్రిప్పుల మట్టిని తోలి చదును చేయించారు. ఆర్అండ్‌బీ రోడ్డు కావడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేశామని, వర్షాకాలం తరువాత శాశ్వతంగా మరమ్మతులు చేయిస్తామన్నారు. టీడీపీ నాయకులు చంద్ర, మనోహర్, మూర్తి, గంగాధర్, అంజనప్ప, ఉదయ్, మల్లికార్జున, జయచంద్రారెడ్డి, ఆదినారాయణ, ఇర్షాద్ పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చివేత


చెరువు కట్టపై కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబరు 9: మండలంలోని మల్లాపల్లి చెరువుకు గండి పడడంతో పూడ్చివేత పనులను మంత్రి సవిత భర్త, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరావు బుధవారం ప్రారంభించారు. నాలుగు రోజుల క్రితం మల్లాపల్లి చెరువుకు తూము పక్కన గండిపడి నీరు వృథా అవుతున్న విషయం తెలిసిందే. ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు చెరువు వద్దకు చేరుకుని పనులకు శ్రీకారం చుట్టారు. చెరువు కట్టపై ముళ్లపొదలు ఉండడంతో తూము వరకు వాటిని తొలగించి దారి ఏర్పాటు చేశారు. ఇసుక తరలించి మూటల్లో నింపి, గండిని పూడ్చే పనులు చేపడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలక్రిష్ణ, మహమ్మద్, నరేష్‌కుమార్ యాదవ్, వెంకటరెడ్డి, శ్రీధర్, వృషభా, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కొరతను తీర్చిన ఎమ్మెల్యే

అమరాపురం, అక్టోబరు 9 : మండల పరిధిలోని హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న బీసీ కాలనీలో బుధవారం బోరు వేయగా రెండు ఇంచుల నీరు పడ్డాయి. నీటి ఎద్దడి గురించి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. 650 అడుగుల వరకు బోరు తవ్వించగా రెండున్నర ఇంచుల నీరు సమృద్ధిగా లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుమారస్వామి, జయకుమార్, ఓంకార్‌స్వామి, రామచంద్రప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


బోరు నుంచి వస్తున్న నీరు

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

హిందూపురం అర్బన్ అక్టోబరు 9: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణకు కరాటే విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని మనస్వి పాఠశాల ఆవరణంలో కరాటే చీఫ్ కోచ్ అల్తాఫ్‌పాషా ఆధ్వర్యంలో కరాటే బెల్టు పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి విద్యార్థి చదువుతో పాటు కరాటే కూడా నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను నేర్చుకోవాలని సూచించారు. వారిని వారు రక్షించుకోగలిగితే చాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంశాపత్రాలు అందించారు. సరయు, శోభన్, సయ్యద్, జాన్, విక్టర్, కిషోర్, ధనుష్, మణికంఠ, షాహిన్‌తాజ్, మన్విత్‌రాజ్ బ్లాక్‌బెల్టు సాధించారు. కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్, సీనియర్లు ఉసామా, హేమంత్, చరణ్‌రాజ్, నేహా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పరిగి, అక్టోబరు 9: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని పరిగికి చెందిన శ్రీనివాసరెడ్డి భార్య మంజులమ్మ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బీరలింగేశ్వరస్వామి కల్యాణమండపంలో బంధువుల వివాహంలో పాల్గొని కాలినడకన ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను హిందూపురం ఆసుపత్రికి తరలించారు.